క్లుప్తంగా

ఆలయ ప్రాంగణంలో మండపం పనులు



వాడ్రాపల్లి పారిపల్లెమ్మ ఆలయం వద్ద మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

మునగపాక : వాడ్రాపల్లి పారిపల్లెమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం మండపం నిర్మించేందుకు సోమవారం సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు భూమిపూజ చేశారు. భక్తుల విరాళాలతో నిర్మించనున్న ఈ మండపంలో ఆలయానికి వచ్చే భక్తులు వంటలు చేసుకునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా సదుపాయాలు కల్పిస్తారు. కార్యక్రమంలో పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గుమ్మం ఏర్పాటుకు పూజలు

మునగపాక : నాగులాపల్లిలో సోమవారం శ్రీ సీతారామస్వామి, వేంకటేశ్వర స్వామి, జగన్నాథస్వామి వారి ఆలయాల పునర్నిర్మాణాల్లో భాగంగా గుమ్మం ఏర్పాటుకు పూజలు చేశారు. గ్రామస్తుల సహకారంతో పాటు దాతల విరాళాలతో ఆలయాలను పునర్నిర్మించనున్న నేపథ్యంలో గుమ్మం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు నివాళి



రాంబిల్లిలో విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న దేముడునాయుడు

రాంబిల్లి : చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పెంచిన విద్యుత్ ఛార్జీలపై పోరాటం చేస్తున్న ముగ్గురిని పొట్టన పెట్టుకోవడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నాటి కాల్పుల్లో వీరమరణం పొందిన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలకు రాంబిల్లిలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివాజీ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు సర్వే



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

పాయకరావుపేట : పట్టణంలో ప్రతి ఇంటా సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించడం జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకంలో భాగంగా ప్రతి ఇంటిని సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు ప్రతి ఒక్కరూ ఇంటికి సంబంధించిన పన్ను రశీదు, డాక్యుమెంట్లు సిబ్బందికి చూపించాలన్నారు. గ్రామంలో 5 టీములుగా సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారన్నారు. టీముకి నలుగురు తిరిగి సర్వే నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు.

కరెంట్ బిల్లుకు ఆధార్ అనుసంధానం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని విద్యుత్ వినియోగదారులందరూ కరెంట్ బిల్లుకు ఆధార్ నంబర్‌ను ఈ నెలఖారులోగా అనుసంధానం చేయించుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. వినియోగదారులు కరెంట్ బిల్లు నంబర్‌తో పాటు ఆధార్ కార్డు జెరాక్స్‌లను అచ్యుతాపురం కరెంట్ ఆఫీస్‌లో సమర్పించాలని ఆయన సూచించారు.

సారా విక్రేత అరెస్ట్

రావికమతం: మూడు లీటర్ల సారాతో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. రాయవరంలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేయగా ఆ గ్రామానికి చెందిన రావి సత్తిబాబు నుంచి మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేశామన్నారు.

చిగురించిన ఖరీఫ్ ఆశలు

- శారద నదిలో పెరిగిన నీటి ప్రవాహం
- పూర్తి స్థాయిలో వరినాట్లు పడే అవకాశం
- ఆనందంలో రైతన్నలు

అన్నదాతల ఖరీఫ్ ఆశలు చిగురించాయి. శారద నదిలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. దీంతో పూర్తి స్థాయిలో వరినాట్లు పడే అవకాశాలున్నాయని, అలాగే ఎండిపోతున్న వరినాట్లు, నారుమడులకు ప్రాణం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాంబిల్లి: సాగునీటి సమస్యతో సతమతమవుతున్న రైతులకు మేలు జరిగింది. 25 శాతం దాటని వరినాట్లు పనులు సోమవారం నుంచి జోరందుకున్నాయి. ఆదివారం రాత్రి ఒక్కసారిగా శారదా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ఇక సాగునీటి కాలువల్లోనూ నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. రైతులు ఆనందంతో పొలం బాట పట్టారు. వర్షాలు పడకపోవడంతో పలుచోట్ల వరి నారుమడులు, వరినాట్లతో పాటు నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన దమ్ము మడులు ఎండిపోతుండడంతో రైతులు కలవరపడ్డారు. ఈ ఏడాది ఖరీఫ్ పనులు పూర్తవుతాయా లేదా అన్న సందేహంతో ఆందోళన చెందారు. ఈ తరుణంలో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో పాటు ఎగువ ప్రాంత పొలాల్లో వరినాట్లు దాదాపు పూర్తి కావడంతో శారద నదిలో నీరు పెరిగింది. యలమంచిలి సబ్ డివిజన్ పరిధిలో గల రాంబిల్లి, యలమంచిలి, అచ్యుతాపురం, ఎస్. రాయవరం మండలాల్లో 9,169 హెక్టార్లలో వరినాట్లు పడాల్సి ఉంది. రాంబిల్లి మండలంలో 2726 హెక్టార్లు, యలమంచిలి మండలంలో 2204 హెక్టార్లు, అచ్యుతాపురం 762 హెక్టార్లు, ఎస్. రాయవరం 3479 హెక్టార్లలో వరినాట్లు పడాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 25 శాతం మేర వరినాట్లు పూర్తయ్యాయి. నీరు అందుబాటులోకి రావడంతో గణనీయంగా వరినాట్లు పనులు జరిగే అవకాశాలున్నాయని అటు రైతులు, ఇటు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దమ్ము పనులకు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు.



ట్రాక్టరు సాయంతో దమ్ము చేస్తున్న దృశ్యం



వరినాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అందుబాటులోకి సాగునీరు



శారద నదిలో నీటి ప్రవాహం పెరగడం ఆనందంగా ఉంది. ఈ నీరు రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. పూర్తి స్థాయిలో వరినాట్లు పనులు పూర్తి కావడమే గాక ఎండిపోతున్న వరినాట్లు, నారుమడులకు ఈ నీరు మేలు చేసింది.

– సీహెచ్ వెంకటరమణ, రైతు, కట్టుబోలు

అవసరమైన సూచనలు అందజేస్తాం



ఆర్‌బీకేల కేంద్రంగా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తాం. క్షేత్ర స్థాయిలో వరి పొలాలను సందర్శించి రైతులకు సకాలంలో సలహాలు అందజేస్తాం. అంతే గాక పూర్తి స్థాయిలో ఈ క్రాప్ నమోదు చేస్తాం. ఎరువులు అందుబాటులో ఉంచాం.

–సి.సుమంత, ఏవో, రాంబిల్లి మండలం

పేదలకు శ్రీరామరక్షగా ప్రభుత్వ పథకాలు



ఎస్.రాయవరం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చిన్నారిని ఎత్తుకుని మహిళను పలకరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రభుత్వ పథకాలు పేదలకు శ్రీరామరక్షగా మారుతున్నాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పలు గృహాలను సందర్శించారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా మాకు తెచ్చి ఇస్తున్నారని, తాము అడిగే లోపే గ్రామ వలంటీర్ ఇంటికి వచ్చి నమోదు చేస్తున్నారని ఇటువంటి పరిపాలన గతంలో ఎన్నడూ లేదని, పదే పదే జగన్ బాబును సీఎంగా గెలిపించుకుంటామని సమాధానం ఇవ్వడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనతో ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో పాటు నాయకులు శరవేగంగా గృహాలను సందర్శించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ మెంబర్ కశింకోట నీలేంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, అప్పలరాజు, అడ్డేపల్లి నూకునాయుడు, ఐ.వి.రత్నం, గరగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దూరవిద్యలో ఇంటర్మీడియట్ కోర్సులు

కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి దూర విద్య ద్వారా ఇంటర్మీడియట్ కోర్సులు అందుబాటులోకి వచ్చినట్టు ప్రిన్సిపాల్ పి.కొండబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం నుంచి ఇకపై దూరవిద్య ద్వారా ఇంటర్మీడియట్‌కు సంబంధించి అన్ని జనరల్ కోర్సుల్లోకి ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెలాఖరు లోగా దరఖాస్తు చేయాలన్నారు. చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థులు, వివిధ కారణాలతో రెగ్యులర్‌గా చదవలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రొయ్యల చెరువు వ్యర్థ జలాలపై స్పందనలో ఫిర్యాదు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడక పరిధిలోకి కడపాలెంకు సమీపంలో రొయ్యల చెరువు నుంచి వ్యర్థ జలాలు యేరులో కలిసిపోతున్నాయని పూడిమడకకు చెందిన పలువురు జిల్లా కలెక్టర్‌కు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై పలు విభాగాలు స్పందించిన తీరు గురించి ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయితీ నుంచి ఎన్‌ఓసీ ఇవ్వనప్పటికీ విద్యుత్ విభాగం ట్రాన్స్‌ఫార్మర్, ఇతరత్రా శాఖలు ఎటువంటి పర్యవేక్షణ చేయడం లేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఉడ్‌పేట విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కార్యాలయంలో సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సమితి జాతీయ నాయకుడు మారేడుపూడి రమేష్ హాజరై సమితి జెండాను ఆవిష్కరించి, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు జి.రాము, కార్యదర్శి పాత్రుపల్లి వీరుయాదవ్, ఉపాధ్యక్షుడు మేరుగు నూకరాజు, సభ్యులు నాగిరెడ్డి చిన్నమనాయుడు, చిరికి కళ్యాణ్, గాదం కాసులు, సూరాడ ప్రభాకర్, మేరుగు సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆలయానికి ద్వార బంధం ఏర్పాటు

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పనులు పునః ప్రారంభం



ద్వార బంధానికి పూజలు చేస్తున్న వేదపండితుడు రేజేటి రామాచార్యులు



కొండపై నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

నాతవరం: ఈరుడి కొండపై రూ.3 కోట్లతో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సోమవారం ద్వారబంధం ఏర్పాటు చేశారు. ముందుగా కశింకోటకు చెందిన వేదపండితుడు రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో ద్వారబంధానికి 21 మంది దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి క్రేన్ సాయంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం ఈరుడి కొండపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేదన్నారు. అలాంటి మహోన్నతమైన శక్తి లేకుండా ఇక్కడ ఆలయ నిర్మాణం సాధ్యం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు, దివంగత అంకంరెడ్డి జమీలు ఆకస్మిక మరణంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయని, మరలా పునఃప్రారంభించడం ఆనందాయకమన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసేంత వరకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఆలయ నిర్మాణం పూర్తి చేసి జమీలు ఆశయం నెరవేర్చాలన్నారు. నాతవరం ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక వ్యవసాయ సలహ మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, నాతవరం ఉప సర్పంచ్, ఆలయ కమిటీ అడ్వైజరు కరక అప్పలరాజు, నాతవరం వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఈసీఈ విద్యార్థులకు అపార అవకాశాలు



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, పలు విభాగాధిపతులు

అనకాపల్లిటౌన్: ఈసీఈ గ్రూప్ విద్యార్థులకు అపార ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని ఈసీఈ విభాగాధిపతి పి.పూర్ణప్రియ అన్నారు. డైట్ కళాశాలలో సోమవారం ఈసీఈ విద్యార్థులకు వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులు ఎప్పటికప్పుడు సర్క్యూట్‌బోర్డు, ప్రాజెక్టుల తయారీ విధానాన్ని సులభంగా తెలుసుకునే అవకాశముందన్నారు. విద్యార్థులు తమ సబ్జెక్టుల్లో నైపుణ్యత సాధించి ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఇంజినీర్ జి.శిరీష, రిసోర్స్‌పర్సన్ ఎం.ఉమామహేశ్వరరావులు పీసీడీ డిజైన్ ప్రాముఖ్యతను తెలియజేశారు.

మండల పరిషత్ సమావేశం నేడు

మునగపాక : మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని మన్మథరావు కోరారు.

31న గవర్ల అనకాపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లిలో ఈ నెల 31న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆళ్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మదర్ మెమోరియల్ మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటులో భాగంగా ఆళ్ల వరలక్ష్మి వర్థంతిని పురస్కరించుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరం జరుగుతుందన్నారు. అదేరోజు ఉచిత కంటి వైద్య శిబిరం కూడా నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు కె.రవికుమార్ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు బుద్ద రవికుమార్ 9642031500, మళ్ల మహలక్ష్మినాయుడు 8142769398 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ అమర వీరులకు నివాళులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేట,అచ్యుతాపురంలలో విద్యుత్ అమర వీరుల దినోత్సవానికి సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యుత్ అమర వీరుల చిత్ర పటాలకు తిమ్మరాజుపేటలో రామునాయుడు, అచ్యుతాపురంలో కె.సోమునాయుడులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోటేశ్వరరావు, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, రాంకుమార్, ఆర్.రాము పాల్గొన్నారు.

సర్వే హద్దులు మార్చాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఆవసోమవరం పరిధిలో ఉన్న సర్వే నంబర్లను 115,116,121లను ఆవరాజాం పరిధిలోకి చేర్చాలని ఆవరాజానికి చెందిన పలువురు నేతలు స్పందనలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సదరు సర్వే నంబర్ల పరిధిలోని ఇళ్లకు మౌలిక సదుపాయాలను ఆవరాజం పంచాయతీ కల్పిస్తున్నప్పటికీ చెల్లించే పన్నులు మాత్రం ఆవసోమవరానికి వెళుతున్నాయని తెలిపారు.

నేడు గౌరీ పంచాయతనలో ఓనం పండగ

అనకాపల్లిటౌన్: స్థానిక గౌరీ పంచాయతన దేవాలయంలో మంగళవారం కేరళ సంప్రదాయ ఓనం పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు గౌరీసేవాసంఘం సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ పాలు, పెరుగు, నెయ్యి, విభూది, చందనం, పళ్ల రసాలు, అభిషేకానికి అవసరమైన వస్తువులు వెంట తీసుకు రావాలని సూచించారు.

పెదహైస్కూల్‌కు ఆర్వో ప్లాంట్ వితరణ



ఆర్వోప్లాంట్ ఏర్పాటును పరిశీలిస్తున్న జాజుల రమేష్, రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక జీవీఎంసీ పెదహైస్కూల్‌కు రోటరీ క్లబ్ సభ్యులు తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను సోమవారం అందించారు. స్కూల్లో తాగునీటి సమస్యపై 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా ఆమె రోటరీ క్లబ్ సభ్యులను ఆర్వో ప్లాంట్ అందించాలని కోరారు. దీంతో స్కూల్ ఆవరణలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు క్లబ్ సభ్యులు చర్యలు చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మితోపాటు, వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, క్లబ్ సభ్యులకు హెచ్ఎం రుధిరారాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు, సభ్యులు కడిమిశెట్టి సతీష్, రాపేటి నారాయణరావు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి చేయాలి



అంధత్వ నివారణ పై కరపత్రాలు ప్రదర్శిస్తున్న మహిళలు

యలమంచిలి : అంధత్వ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యలమంచిలి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ జనార్దన్ అన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం, 28వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సూచనల మేరకు యలమంచిలి సీహెచ్‌సీ పరిధిలో అంధత్వ నివారణపై సోమవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆస్పత్రిలో మహిళలకు కంటి పరీక్షలు చేసి నేత్ర దానంపై వాటి వల్ల ఉపయోగాలు పై ఆస్పత్రి వైద్య బృందం పలువురికి అవగాహన కల్పించారు. మహిళలతో అంధత్వ నివారణపై కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ అంధత్వ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎవరైనా ప్రమాదాల్లో మరణించినవారి, అనారోగ్యంతో మరణించిన వారి నేత్రాలు దానం చేయడం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపిన వారు అవుతారని కంటి డాక్టర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు నిహారిక, ప్రత్యూష, భారతి కంటి వైద్య సిబ్బంది లీల, జయ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత గణపర్తి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఫైనల్‌లో తలపడుతున్న గణపర్తి-వాడ్రాపల్లి జట్లు

మునగపాక : మండలంలోని గణపర్తి గ్రామంలో మోదకొండమ్మ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ఫైనల్స్‌లో గణపర్తి, వాడ్రాపల్లి మధ్య పోరు గట్టిగా సాగింది.

ఈ పోరులో గణపర్తి జట్టు ప్రథమ స్థానంలో నిలవగా వాడ్రాపల్లి జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. అచ్యుతాపురం జట్టు తృతీయ స్థానం, చూచుకొండ జట్టుకు చతుర్థ బహుమతులు దక్కాయి. విజేతలకు ఆలయ చైర్మన్ చదరం రమణ బహుమతులు అందజేశారు. గణేష్ కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సత్తిబాబు, లక్ష్మీనారాయణ, పెంటకోట గణేష్, సంతోష్ పాల్గొన్నారు. కాగా పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

18 ఏళ్ల లోపు చదువుకోలేని వారిని గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంఈవో-2 శివనాయుడు

మునగపాక : ఐదు నుంచి 18 సంవత్సరాల వయస్సులోపు చదువుకోలేని వారిని గుర్తించాలని ఎంఈవో-2 శివనాయుడు కోరారు. మండల పరిషత్ హాలులో సోమవారం వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని, ఇందుకోసం చదువుకోకుండా బయట తిరుగుతున్న వారిని గుర్తించేందుకు సర్వే చేపట్టాలన్నారు. సర్వే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. వలంటీర్ల సహకారంతో కార్యక్రమం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. సీఆర్పీలు అచ్యుతకృష్ణ, మద్దాల గోవింద, నూకేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశ భాషల్లో ఉన్నతమైన భాష తెలుగు



బహుమతులు పొందిన విద్యార్థులతో దాడి రత్నాకర్, స్కూల్ యాజమాన్యం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనకాపల్లిటౌన్: తెలుగు భాషలో ఉన్న ఔన్నత్యం దేశ భాషల్లో మరే భాషకు లేదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ ముందస్తు వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలంటే అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అత్యాధునికి విద్య, అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. తెలుగు భాషతోపాటు గ్లోబల్ భాష ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతుల్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అంతకుముందు పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ, వసతులను పరిశీలించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, వైఎస్సార్‌సీపీ నేతలు కొణతాల భాస్కర్, దాడి ఈశ్వరరావు, కర్రి అప్పాజీ, కోరిబిల్లి ఆరుద్ర, కోటిపల్లి శ్రీను, కొణతాల పరదేశినాయుడు, కర్రి వెంకటరావు, తణుకు రవి, ఎస్.నాగు, మారిశెట్టి శ్రీను, విల్లూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంతకు తగ్గిన మేకలు, గొర్రెల రాక



సంత నుంచి తరలించుకుపోతున్న గొర్రెలు



తాళ్లపాలెం సంతలో విక్రయానికి వచ్చిన గొర్రెలు

- ఆశించిన ధర లేక వెనక్కి తరలింపు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంతలో ఈ సోమవారం కూడా గొర్రెలు, మేకలు తక్కువ వచ్చాయి. గత వారం నుంచి ఇక్కడకు ఇవి తక్కువగా వస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం గొర్రెల మందలకు రుణాలు ఇస్తూ వాటిని రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా ప్రాంత సంతల్లో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఆయా సంతలకు గొర్రెలు అమ్మకానికి తరలి పోతున్నాయి. దీంతో ఇక్కడి సంతకు వాటి రాక తగ్గిపోయింది. సాధారణంగా సంతకు వెయ్యి వరకు గొర్రెలు, మేకలు అమ్మకానికి వచ్చేవి. గత వారం నుంచి వాటిలో సగం కూడా రావడం లేదు. అమ్మకానికి వచ్చిన వాటికి కూడా ఆశించిన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పెంపకందారులు, వ్యాపారులు వ్యాన్లలో తిరిగి ఇంటికి తీసుకుపోతున్నట్లు నర్సీపట్నానికి చెందిన పల్లా నాయుడు తెలిపారు. వీటిని ఇతర సంతలకుగాని, మళ్లీ వచ్చే వారం ఇక్కడి సంతకు అమ్మకానికి తీసుకు రానున్నట్లు తెలిపారు. ఆశించిన ధర వస్తే విక్రయిస్తామన్నారు.